ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024



మెరిట్ జాబితా విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 29: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్ సిబ్బంది ఒప్పంద పొరుగు సేవల పోస్టుల భర్తీ మెరిట్, ఎంపిక జాబితా విడుదల చేశామని డీఎంహెచ్‌వో అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్‌నర్సు 9, ఫార్మాసిస్టు గ్రేడ్ 2-5, డీఈవో 1, డీఈఓ కం అకౌంటెంట్ 1 పోస్టుల జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. ఎంపికైన అభ్యర్థులు జూలై 7న ఉదయం 11.30 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

సీజేరియన్ ప్రసవాలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 29: ప్రైవేటు ఆసుపత్రుల్లో సీజేరియన్ ప్రసవాలు తగ్గించాలని, సాధారణ ప్రసవాలు చేయాలని డీఎంహెచ్‌వో అనిత సూచించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ప్రసవాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకొంటామన్నారు. ప్రతీ ఆసుపత్రిలో ధరల పట్టిక, వైద్యుల వివరాలను, అందిస్తున్న సేవలను ప్రదర్శించాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఆసుపత్రిలో క్వాలిఫైడ్ పారామెడికల్ సిబ్బందిని నియమించాలని, రోగులకు సరైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ఆసుపత్రుల్లో పరీక్షలు చేసినప్పుడు వాటి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రోగ్రాం అధికారి నీరజ, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి, 23 మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నస్పూర్, జూన్ 29: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట అఖిల ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో యాదయ్యకు అందజేశారు. కలెక్టరేట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో లక్షల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఏబీవీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈశ్వర్, విభాగ్ కన్వీనర్ అజయ్‌లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవ్వాల కనువిందు



కవ్వాల ప్రధాన రహదారి

- ఎటు చూసినా పచ్చదనమే
- పారుతున్న వాగులు

జన్నారం, జూన్ 29: కవ్వాల అభయారణ్యం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చదనం పరుచుకుంది. కవ్వాల అభయారణ్యం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు నుంచి జన్నారం ఇటు కడెం మండలం వరకు సుమారు 60 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రధాన రహదారి వెంట ఉన్న అటవీ ప్రాంతం పచ్చదనంతో స్వాగతం పలుకుతోంది. ఈ రహదారిలో ప్రయాణించే వారు పచ్చదనం, పక్షుల కిలకిలు, అక్కడక్కడ అగుపించే వన్య ప్రాణులను చూస్తూ పరవశించిపోతారు. ప్రధాన రహదారులు ఇరువైపుల పచ్చదనం స్వాగతం పలుకుతున్నట్లు ఉండడంతో మనసు ఆహ్లాదకరంగా మారుతుంది. వర్షాలకు వాగులు, వంకలు, సెలయేర్లు గల గల పారుతుండగా మరో వైపు జంతువుల అలజడి వాటి కూతలు ఎంతగానే ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే కవ్వాల అభయారణ్యాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏకో టూరిజం ఆధ్వర్యంలో సఫారీలను ఏర్పాటు చేశారు. ఈ వర్షాకాలం మొదలైందంటే అడవి పచ్చదనంతో పాటు వన్య ప్రాణులను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి

కవ్వాల టైగర్‌జోన్‌లోని వన్య ప్రాణులు, అటవీ సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వన్య ప్రాణులు అధికంగా తిరిగే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువుల వద్ద వాటిని మానిటరింగ్ చేసేందుకు యానిమల్ ట్రాకర్లను ఏర్పాటు చేసి వాటికి ఇబ్బందులు కలుగకుండా దాహార్తీ తీర్చే విధంగా చర్యలు చేపట్టారు. అటు పర్యాటకులు వీక్షించే విధంగా రహదారులు, మంచెలు కనువిందు చేస్తాయి.

హరిత టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

- తెలంగాణ హరిత టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా కవ్వాల టైగర్ జోన్‌లోని అటవీ వన్యప్రాణులను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల కోసం ప్రత్యేకంగా జంగిల్ సఫారీలను ఏర్పాటు చేశారు. దీంతో అభయారణ్యంలో సుమారు 15 కిలోమీటర్ల మేర లోపలికి గైడ్ తీసుకువెళ్లడంతో పాటు అడవిని, వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉండేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- కవ్వాల అభయారణ్యంను వీక్షించేందుకు వచ్చేవారి కోసం తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హరిత రిసార్టు, ప్రత్యేక కాటేజీలను ఏర్పాటుచేశారు. జన్నారం అటవీ డివిజన్‌తోపాటు నిర్మల్ జిల్లా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు వద్ద మరో హరిత రిసార్టు, బోట్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో సెలవు దినాల్లో ప్రజలు ఎక్కువగా వస్తున్నారు.



బైసన్‌కుంట మంచె వద్ద సుందర దృశ్యం



కవ్వాల అభయారణ్యంలోని వాగు



వన్య ప్రాణుల కోసం ఏర్పాటు గ్రాస్‌ల్యాండ్

సీపీని కలిసిన డీసీపీ



సీపీని కలిసిన మంచిర్యాల డీసీపీ

మంచిర్యాల అర్బన్, జూన్ 29: మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ శనివారం రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సీపీ మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో సత్సంబంధాలను ఏర్పరుచుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

ఏసీసీ: జిల్లా ప్రధాన జడ్జి బోయ శ్రీనివాసులును డీసీపీ భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన జడ్జిని డీసీపీ కలిసి మొక్కను అందజేశారు. డీసీపీ భాస్కర్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాయమల్లు మర్యాద పూర్వకంగా కలిశారు.

కేసులపై జడ్జి సమీక్ష



ఏసీసీ, జూన్ 29: మంచిర్యాల జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి శనివారం కోర్టుహాలులో హిట్‌అండ్‌రన్ కేసులపై సమావేశం నిర్వహించారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఏసీపీ ప్రకాష్‌లు పేర్కొన్నారు. జడ్జి మాట్లాడుతూ బాధితులకు నష్టపరిహారానికి సంబంధించి అధికారులకు సూచనలు, సలహాలు అందేలా చర్యలు తీసుకోవాల న్నారు.

నిత్యజీవితంలో గణాంకాల పాత్ర కీలకమైనది



గణాంక దర్శిని పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 29: నిత్య జీవితంలో గణాంకాల పాత్ర కీలకమైనదని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ ప్రశాంత చంద్రమహలనోబిస్ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్‌ఖాసీంతో కలిసి జిల్లా, మండల గణాంక దర్శిని పుస్తకాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో ప్రశాంతచంద్ర మహలనోబిస్ ప్రముఖపాత్ర పోషించారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి గణాంక, ఉప గణాంక, ముఖ్యప్రణాళిక అధికారులు కృషి చేయాలన్నారు. ఉపగణాంక అధికారులు రాజేందర్, మూర్తి, పాపయ్య, సురేష్, అనురాధ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాదాసలాం, అధికారులు శ్రీనివాస్, వేణు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీఎఫ్‌డీసీ అధికారులు

కలెక్టర్ కుమార్ దీపక్‌ను అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్, లక్ష్మణ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్లాంటేషన్ పనులను కలెక్టర్‌కు వివరించారు. జైపూర్ మండలంలోని కుందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్‌ను టీజీఎఫ్ డీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద మంజూరైన నిధులతో సమకూర్చామని, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధరణిలోని వివిధ మాడ్యూల్స్‌లో సమస్యల పరిష్కారానికి అందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారం రోజుల్లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మించనున్న సమీకృత గురుకుల పాఠశాలలు, కళాశాలలకు స్థల సేకరణ చేయాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 7319 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రోజు దాదాపు 400 దరఖాస్తులను పరి శీలించామన్నారు. మరో 3 రోజుల్లో తహసీల్దార్ పరిధిలోని దరఖాస్తులను పూర్తి చేస్తామని తెలిపారు. సమీకృత గురుకుల పాఠశాల, కళాశాలలకు కోటపల్లి మండలం సాంఘిక సంక్షేమ పాఠశాల సమీపంలో 20 ఎకరాలను గుర్తించామని, నివేదిక అందిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, కలెక్టరేట్ బీ సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్ పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఏసీసీ, జూన్ 29: పట్టణంలోని హమాలీవాడ ప్రాథమిక పాఠశాలలో తాగు నీరు, టాయిలెట్లు, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి శనివారం నిరసన వ్యక్తంచేశారు. పాఠశాలలో బోరు రిపేరులో ఉండడంతో నీటి వసతి లేక మధ్యాహ్న భోజనం వండి పెట్టడం లేదన్నారు. ఇంటి నుంచే భోజనం, నీరు తెచ్చుకుంటున్నారన్నారు. భోజనం చేశాక చేతులు కడుక్కోవడానికి కూడా నీరు లేదన్నారు. టాయిలెట్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయులు ఉండడంతో అన్ని సబ్జెక్టులు బోధించడం ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ, బీజేపీ నాయకుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: ప్రాథమిక పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తంచేశారు. శ్రీకాంత్, సన్నిగౌడ్‌లు మాట్లాడుతూ పాఠశాలలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మరుగుదొడ్లు సరిగ్గా లేవన్నారు. కౌన్సిలర్ రాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కవ్వాలను సందర్శించిన ఐటీడీఏ పీవో



జంగల్ సఫారీ చేస్తున్న ఐటీడీఏ పీవో

జన్నారం, జూన్ 29: జన్నారంలోని కవ్వాల టైగర్ రిజర్వును శనివారం ఉట్నూరు ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా సందర్శించారు. గోండుగూడ మల్యాల నుంచి బైసన్‌కుంట వరకు జంగల్ అటవీశాఖ సఫారీలో పర్యటించారు. స్లోత్ బేర్లు, చింకారాలు, స్పాటెడ్ డీర్, బైసన్ వంటి వన్యప్రాణులతో పాటు సర్పెంట్ ఈగల్, హాక్ ఈగల్, వైట్ త్రోటెడ్ కింగ్‌ఫిషర్, పేరాకిట్‌లు, బ్లాక్ డ్రాంగో, కాలర్డ్ డవ్, స్పాటెడ్ డవ్ వంటి పక్షులను చూసి ఆనందం వ్యక్తం వ్యక్తంచేశారు. జంగల్ సఫరా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు, జూన్ 29: చెన్నూరు పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ నాయకులు శనివారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిలో కనీస వసతులు కల్పించ లేదన్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.98 కోట్లతో ఆసుపత్రికి కావాల్సిన ఫర్నీచర్‌ను కొనుగోలు చేయాలని, ఎక్స్‌రే ప్లాంట్, సీటీ స్కాన్ త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ఐసీయూ కేంద్రాలు, రెండు అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి స్పందించి ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బత్తుల సమ్మయ్య, చారి, వెంకటనర్సయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలి



మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు

ఏసీసీ, జూన్ 29: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో 60 సంవత్సరాలపై బడిన, అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కాంట్రాక్టు కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని శనివారం చైర్మన్ ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రెయిన్‌కోట్లు ఇవ్వాలని, నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ప్రావిడెంట్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ పథకాల్లో తప్పులను సరి చేయాలన్నారు. డ్రైవర్లకు స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యాంకుమార్, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

ఏసీసీ, జూన్ 29 : జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పదవ రాష్ట్ర స్థాయి మెన్, వుమెన్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం హోరాహోరీగా జరిగాయి. మెన్, వుమెన్ విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమిఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. పోటీల కన్వీనర్ గాజుల ముకేష్‌గౌడ్, టోర్నమెంట్ అబ్జర్వర్ బాబులు పోటీలను పర్యవేక్షించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు భాస్కర్, వాసు, బండ మీనారెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం

మంచిర్యాల అర్బన్, జూన్ 29: రామగుండం కమిషనరేట్ పరిధిలో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ శ్రీనివాస్ సన్మానించారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ రాజమౌళిగౌడ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు సిరాజ్ అహ్మద్, కళాధర్‌రెడ్డి, ఆర్ఎస్సై కె.లచ్చన్న, ఏఎస్సై డి.స్వామి, హెడ్‌కానిస్టేబుల్ డి.కృష్ణమాచారి, జూనియర్ అసిస్టెంట్ రామచంద్రంలను సీపీ సన్మానించారు.

మంచిర్యాల కలెక్టరేట్: పదవీ విరమణ పొందిన జిల్లా పశువైద్యాధికారి రమేష్, మత్స్యశాఖ అధికారి సత్యనారాయణలను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ సన్మానించారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలి

మంచిర్యాల అర్బన్, జూన్ 29: బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలంటూ శనివారం ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితీ నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు కర్రె లచ్చన్న, శ్రీపతి రాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అందించాలి

దండేపల్లి,జూన్, 29: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించాలని నెల్కి వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కాసనగోట్లు లింగన్న కోరారు. శనివారం సర్వసభ్య సమావేశంలో రైతు భరోసా పథకంపై రైతులు, సభ్యుల నుంచి సలహాలు సూచనలను ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ టిక్కు, ఎంపీటీసీ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో స్వీకరించారు. అనంతరం రైతుల కోసం సహకార సంఘం అందించే సబ్సిడీ పథకాలను వివరించారు. సీఈవో సింగతి కిషన్, సిబ్బంది వెంకటేష్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

దీపావళి నాటికి క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ అందుబాటులోకి



ఎంపీ వంశీకృష్ణకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

రామకృష్ణాపూర్, జూన్ 29: దీపావళి పండుగ నాటికి క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి రాలేదన్నారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీకిఘన స్వాగతం

జైపూర్: పెద్దపల్లి ఎంపీగా ఎన్నికైన గడ్డం వంశీకృష్ణకు శనివారం ఇందారం బస్టాండ్ వద్ద మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే ఓదెలు ఆధ్వర్యంలో వంశీకృష్ణకు గజమాలతో స్వాగతం పలికారు.

మందమర్రిటౌన్: అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌వెంకస్వామి తెలిపారు. శనివారం రాత్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నీట్ పేపరు లీకేజీతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదిల్‌పేట, చిర్రకుంట, పొన్నారం, సారంగపల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు బైకుల ద్వారా ర్యాలీగా తరలి వెళ్లి స్వాగతం పలికారు. గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య , కమల్ మనోహర్‌రావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

హాజీపూర్, జూన్ 29: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ పదవులు చేపట్టాలన్నారు. ఎంపీపీ స్వర్ణలతశ్రీనివాస్‌ను ఎంపీటీసీలు సన్మానించారు. వైస్ ఎంపీపీ రమాదేవి, హాజీపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవోమల్లయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ముసుగులో అరాచకాలు

మంచిర్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ముసుగులో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారు తమ పద్ధతులు మార్చుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు విలేకరుల ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తూ గుండాయిజం చేస్తున్నారని, మహిళలపై అకృత్యాలకు పాల్పడుతూ భయానక వాతావరణం కల్పిస్తున్నారని తెలిపారు. పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు.

తాండూర్ వారసంత వేలం

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 29 : తాండూర్ ఐబీలోని వారసంత శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంతకు వేలం పాట నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 9 నెలలకు వేలం పాట నిర్వహించగా రూ.70 వేలకు షేక్ మోమిన్ అలీ దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తపాస్‌కుమార్, చందు, నాగయ్య, ఈసా, విగ్నేష్, హైమద్ హుస్సేన్, శ్రీనివాస్, కైసర్, శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

● ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రామకృష్ణాపూర్, జూన్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎంఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పదేళ్ళుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రజల ఆగ్రహానికి గురైన ప్రభుత్వాలు కూలిపోవడం తెలంగాణాలో మరోసారి బీఆర్ఎస్ అవినీతిపాలనకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడమే కాక ప్రజలను ఇబ్బందులకు గురి చేసే అధికారులకు, ప్రజాప్రతినిధులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వంద రోజుల పాలనపై ప్రజలు పూర్తి విశ్వాసంగా ఉన్నారని, నిరుద్యోగుల విషయంలో ఇప్పటికే స్పష్టమైన ఫలితాలను అందించడమే కాక మెగా డీఎస్సీని నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. శాఖల ప్రక్షాళన విషయంలో ముఖ్యమంత్రి ఇప్పటికే చర్యలు చేపట్టారన్నారు. ప్రజలకు పాలన విషయంలో ఇబ్బందులు కలగకుండా ప్రజాపాలన ద్వారా అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల వద్ద, కార్యాలయాల వద్ద అర్జీలు స్వీకరించడమే కాక వాటి పరిష్కారానికి అధికారులు పని చేస్తున్నారన్నారు. కాకా వెంకటస్వామికి ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని వంశీకృష్ణ గెలుపుతో రుజువు చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మరింత బలాన్ని సమకూర్చారని, ప్రతిపక్షం లేకుండా చేస్తామన్నట్టు బీజేపీ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజల పక్షాన నిలబడే నాయకున్ని ప్రజలు ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతతోపాటు అన్ని రంగాల అభివృద్ధిలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల, క్యాతన్‌పల్లి మున్సిపల్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

భీమారం, జూన్ 29: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో రాథోడ్ రాధ సూచించారు. శనివారం సూపర్‌వైజర్ రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీల సెక్టార్ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. కేంద్రాలను సమయానికి తెరవాలని, పిల్లల ఎత్తు, బరువులను కొలవాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని, ప్రతి కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు.

మృతదేహం లభ్యం

జన్నారం, జూన్ 29: పొనకల్ పంచాయతీ పరిధి శ్రీలంక కాలనీలోని చర్చి వెనకాల జగ్గు (50) అనే వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. మృతదేహం ఉందని తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రాహుల్ పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతిచెందిన వ్యక్తి జగ్గు అని గత 20 సంవత్సరాలుగా మండలంలోని ఓ వడ్రింగి వద్ద పనిచేసేవాడని, గత మూడు నెలలుగా ఆరోగ్యం బాగా లేక భిక్షాటన చేసి జీవిస్తున్నాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, జూన్ 29: బెల్లంపల్లిలో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుషాపులు, కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని శనివారం అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నాయకులు ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందించారు. పగలు, రాత్రి తేడా లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

నస్పూర్, జూన్ 29 : ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలిపోయిన బాధిత కుటుంబానికి శనివారం మున్సిపల్ ఛైర్మన్ సుర్మిళ్ళ వేణు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. 19వ వార్డుకు చెందిన వీరేశం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ డైరెక్టర్లుకు ఘన సన్మానం

దండేపల్లి,జూన్29: లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, డైరెక్టర్లు కట్కూరి రాజన్న, బండ రాకేష్, గాండ్ల విజయ్, కనక జంగులను మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మ్యాదరిపేటలో సన్మానించారు.

ఘనంగా శ్రీచైతన్య పాఠశాల ఫ్రెషర్స్ డే

ఏసీసీ, జూన్ 29: లక్ష్మీనగర్ బ్రాంచ్ శ్రీచైతన్య పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఆయూబ్, డీన్ ప్రియాంక, ప్రైమరీ ఇన్‌చార్జీ అనగమతి, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సర్వే అధికారిగా పనిచేసిన నర్సయ్య సేవలు అభినందనీయమని మందమర్రి జీఎం మనోహర్ ప్రశంసించారు. శనివారం పట్టణంలోని ఇల్లందుక్లబ్‌లో నర్సయ్య పదవీవిరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మానంలో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ ఉద్యోగులతోకలిసి మెలిసి ఉండే అధికారులను ఎప్పుడు మర్చిపోలేమని అన్నారు. నర్సయ్య శేష జీవితం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

- తెలంగాణకే తలమానికమైన సింగరేణిసంస్థ మనుగడ దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలు సరికావన్నారు.

మందమర్రిరూరల్(కాసిపేట): కాసిపేట2గనిపైశనివారం నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను ఏరియాజీఎం మనోహర్ ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ కాసిపేట2గనిలో రెండు ఎస్‌డీఎల్ యంత్రాలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దీనిద్వారా ఉత్పత్తివేగంగా జరుగుతుందన్నారు.

ఆసిఫాబాద్: ఇంగ్లీష్ భాషాభివృద్ధి, నైపుణ్యాలపై ప్రతిఉపాధ్యాయుడు పట్టుసాధించాలని గిరిజనసంక్షేమశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉద్ధవ్ సూచించారు. శనివారం జిల్లాకేంద్రలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణలో పాల్గొని మాట్లాడారు.

-ఆసిఫాబాద్ డిపోలో శనివారం ప్రగతిచక్రం అవార్డు ప్రోగ్రాం నిర్వహించారు. ఉద్యోగులపిల్లలతో లక్షేలక్ష్యం అన్నఅంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందినవారికిడీఎంబహుమతులు అందజేశారు.

-కేంద్రప్రభుత్వం బొగ్గుగనుల వేలంపాట ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో శనివారం నిరసన చేపట్టారు.

వాంకిడి: వాంకిడి మండలపరిషత్ కార్యాలయంలో జూలై2న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీపీతోపాటు అధికారులు హాజరుకావాలని కోరారు.

-వాంకిడి గ్రామపంచాయతీ ఆవరణలో జూలై2న వారసంతకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు 2వతేదీన ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయంలో రూ.50వేలు డిపాజిట్ చేయాలన్నారు.

సిర్పూర్(యు): మండలంలో శనివారం ఓమోస్తరు వర్షం కురిసింది. రెండురోజులుగా అడపాదడపా వర్షాలు పడుతుండడంతో మొక్కలకు జీవం పోసినట్లయిందని రైతులు అంటున్నారు.

పెంచికలపేట: మండలంలోని శనివారం గంటపాటు భారీవర్షం కురవడంతో రైతుల ముఖాల్లో చిరునవ్వు కనబడింది. విత్తనాలు మొలకెత్తుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

-గ్రామాల్లో నూతనంగా వేసిన బీటీరోడ్డుపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్‌లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని శనివారం ఎర్రగుంట గ్రామానికి చెందిన యువకులు ఎస్సై కొమురయ్యకు వినతిపత్రం అందజేశారు.

-మండలకేంద్రంలో వారంరోజుల క్రితం వంకులం గ్రామానికి చెందిన రెడ్డిప్రవీణ్ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్‌చేసి బాధితుడికి శనివారంఫోన్ అప్పగించినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.

-మండలంలోని ఎల్కపల్లి గ్రామశివారులోని పంటల వివరాలను ఏఈవో లావణ్య శనివారం నమోదుచేశారు. రైతులంతా పంటల వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకుఅమ్ముకోవచ్చని పంటకు బీమా వర్తిస్తుందన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రాయితీపైన బస్సుపాసుల జారీ మేళా నిర్వహించి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో చంద్రయ్య, వికలాంగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: చింతలమానేపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య తండ్రి పోచయ్య(90) శనివారం అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కౌటాల: మండలకేంద్రంలోని సదాశివపేట శివాలయానికి రూ.30 వేల విలువ చేసే ఇన్వర్టర్‌ను కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సయ్యద్ గౌస్ అనే ఎలక్ట్రీషియన్ శనివారం విరాళంగా ఇచ్చారు. ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నందున కరెంటు సమస్యఉందని ఆలయ ప్రధానార్చకులు తెలపగా వెంటనే స్పందించిన గౌస్ సొంత డబ్బులతో ఆలయానికి ఇన్వర్టర్ కొనిచ్చాడు. దీంతో పలువురు గౌస్‌ను అభినందించారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడీ విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడీ విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడీ విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడీ విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడీ విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.


ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బోకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత **అశ్వనీదత్**‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్ల వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.



మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?


నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తూనే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్స్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!




సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన **నుస్రుత్ భరూచా** గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఇదో కెరీర్ అని ఒప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్'(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకో వాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'అజీబ్ దాస్తాం', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 30 జూన్ 2024

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్, జూన్ 29: రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆదివారం జిల్లాలో పర్యటించ నున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం నిర్వహించే పలుఅభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొను న్నారు. అక్కడి నుంచి రెబ్బెన మండలం నవేగాం, ఖైరిగాంలలో పల్లె దవాఖా నలు ప్రారంభించి గంగాపూర్‌లో కేజీబీవీ కళాశాలను ప్రారంభించనున్నారు. అక్కడినుంచి జిల్లాకేంద్రంలోని డైట్‌కళాశాలను ప్రారంభించనున్నారు. అనంతరం సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో పలుఅభివృద్ధి పనులను ప్రారంభించ నున్నారు.

జాప్యం లేకుండా ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 29: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధానకమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. జూన్ 15నుంచి 28వరకు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాలవారీగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ ఆర్ పట్టా పాసుపుస్తకం, కోర్టు కేసు, కోర్టు వివాదంలో ఉన్న పట్టా పాసుపుస్తకం, డేటా కరెక్షన్, జీపీఏ, నిషేధిత భూములు, నూతన పట్టాపాసు పుస్తకాల జారీ, నాలా, ఖాతామెర్జింగ్, భూసంబంధిత ఫిర్యాదులు, నాలా, పీపీబీ, పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, అర్బన్ ల్యాండ్ తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలుసూచనలు చేశారు. అధికారులు అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తరువాత సంబంధిత దరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఆధార్ బయోమెట్రిక్ వేలి ముద్ర స్వీకరణకు సంబంధించిన ఎల్1 పరికరాల వినియోగపు గడువు ముగుస్తున్ననేపథ్యంలో జిల్లాకు ఎల్1బయోమెట్రిక్ పరికరాలు పంపామన్నారు. వీటిని సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పాలన తప్పదా?



● జూలై 4తో ముగియనున్న జిల్లా, మండల పరిషత్ అధ్యక్షుల పదవీకాలం

● జిల్లాలో 15ఎంపీపీ, జడ్పీటీసీలు

బెజ్జూరు, జూన్ 29: ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసింది. దాన్ని పొడిగించకుండా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది. జూలై 4న జిల్లా, మండలపరిషత్ చైర్మన్ల పదవీకాలం ముగియనుంది. వారిని కొనసాగిస్తారా? లేక ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనేవిషయంపై చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్థానికసంస్థల ఎన్నికలను ఒకేసారి అక్టోబరులో నిర్వహించేందుకు సిద్ధమని ప్రకటించింది. దీంతో పదవీ కాలం పూర్తికావస్తున్న జిల్లా, మండలపరిషత్‌లకు ప్రత్యేక అధికా రుల నియామకం తప్పదా అన్న చర్చ సాగుతోంది.

పట్టుకోసం కాంగ్రెస్..

ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా పరిధిలో నాలుగుజిల్లాల జడ్పీ చైర్మన్లు బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. జడ్పీటీసీ సభ్యులు కూడా ఆపార్టీ పక్షాన ఎక్కువ మంది కొనసాగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు జిల్లాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు కొందరు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కొందరు ఎంపీపీలపై అవిశ్వాస తీర్మాణాలు ప్రవేశపెట్టి హస్తగతం చేసుకుంది. వీరి పదవీకాలం నాలుగు రోజులు మాత్రమే మిగిలింది. తమ పదవులు కొనసాగిస్తారనే ఆశ కొందరిలో ఉంది. కానీ కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించాలని కోరుకుంటున్నట్లు సమాచారం.

అధికారుల ను తమకు అనుగుణంగా మలుచుకొని స్థానిక సంస్థల్లో పాగా వేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని అక్టోబరు వరకు వేచి చూసే ధోరణిలో ఉంది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా జిల్లాల పర్యటన చేపట్టి పార్టీని పటిష్టం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి సమీక్షలు నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.

ఆలోగా రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసి ఎన్నికలకు వెళ్తేనే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో ఇక ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు అందేలా చూడటంతోపాటు, ప్రభుత్వం ముఖ్యంగా రైతు రుణమాఫీ చేసి ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పదవీకాలం ముగియనున్న పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో అన్ని జడ్పీటీసీ, మండల పరిషత్‌లను కాంగ్రెస్ వశం చేసుకోవడానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం క్యాడర్‌కు ఇప్పటి నుంచే ఆదేశాలు జారీచేశారు. గ్రామస్థాయినుంచి పార్టీని పటిష్టం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు..

బీసీ జనగణన చేపట్టి ఆ తర్వాత గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు చేపట్టాలని ఒకవైపు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇదిలా ఉండగా గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లను ఐదేళ్లపాటు కొనసాగాలని అప్పటి ప్రభుత్వం చట్టం రూపొందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిన అవసర ముంది. స్థానికసంస్థల ఎన్నికలు వరుసక్రమంలో రానున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పథకాలు అమలు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి

● జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి


జడ్పీటీసీలు, ఎంపీపీలతో జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జూన్ 29: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేకసమావేశానికి జడ్పీ చైర్మన్ కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గసభ్యులు, మండల పరిషత్ సభ్యులు జిల్లా అభివృద్ధికి ఎంతో సహకరించారన్నారు. అధికారులను సమన్వయం చేసుకుని ప్రజాసమస్యలను పరిష్కరించారన్నారు. ఈఅయిదేళ్లలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాలు సాఫీగా కొనసాగాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరాలు జిల్లాపరిషత్ చైర్మన్‌గా పనిచేశానని అన్నారు. ఆ సమయంలో సభ్యులు, అధికారులు సమన్వయం తో వ్యవహరించి సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అనంతరం గౌరవ సభ్యులను, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మిని జిల్లాపరిషత్ అధికారులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్ రావు, అజయ్‌కుమార్, చంద్రశేఖర్, సంతోష్, రామారావు, ద్రుపతాబాయి, సరిత, ఎంపీపీలు మల్లికార్జున్, విమలాబాయి, శ్రీదేవి, సౌంధర్య, మోతీరాం, సీఈవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం లాభదాయకం: కలెక్టర్


జిల్లా గణాంక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 29: చేపల పెంపకంద్వారా మంచి లాభాలను పొందవచ్చని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్స్యకారుల అవగాహన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, అడిషనల్ డీఆర్డీవో రామకృష్ణ, షెడ్యూల్‌కులాల అభివృద్ధి అధికారి సజీవన్, ఇన్‌చార్జి జిల్లా మత్స్యశాఖాధికారి సాంబశివరావు, జిల్లాసమాఖ్య అధ్యక్షురాలు త్రివేణి, కన్సల్టెంట్ ఉదయ్‌కిశోర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వరాయితీలను ఉపయోగించుకుని చేపల పెంపకం చేపట్టడం ద్వారా గొప్పలాభాలను పొందవచ్చన్నారు. చేపల సాగుకు రెండుఎకరాలస్థలం, బోర్ సదుపాయం ఉండాలన్నారు. నేడు వస్తున్న నూతనటెక్నాలజీ ద్వారా ఇంటిమిద్దెలపై, వ్యవసాయ క్షేత్రాల్లోనూ ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటుచేసి కూడా సాగు చేయవచ్చన్నారు. చేపల పెంపకానికి రూ.5లక్షల పెట్టుబడి, నాలుగు గుంటల స్థలం, సంవత్సరానికి మూడు పంటలు, రెండులక్షల ఆదాయం ఒక రైతుకి లబ్ధి చేకూరుతుందన్నారు. దీనినే 5,4,3,2,1గా సూత్రీకరించి తెలుపుతారన్నారు. ఈఅవకాశాన్ని రైతులు, స్వయం సహాయకసంఘాల మహిళలు వినియోగించుకోవాలని ఎలిపారు. వీరికోసం ప్రభుత్వం ఎన్నో రాయితీలు, సబ్సిడీలు కల్పిస్తుందని తెలిపారు. ఇంటి మిద్దెలపై చేపల పెంపకం చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చన్నారు. మార్కెటింగ్ కూడా సులభంగా చేసుకోవ చ్చని తెలిపారు. అలాగే చేపలపెంపకానికి ఉపయోగించిన నీరు మొక్కలకు సేంద్రియఎరువుగా ఉపయోగపడుతుందని, యూరియాతక్కువమోతాదులో అందిస్తే సరిపోతుందన్నారు.

జిల్లా సమగ్రసమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలి..

జిల్లా సమగ్ర సమాచారాన్ని అధికారులు ప్రజలకు చేరువ చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సమగ్ర గణాంక హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. హ్యాండ్‌బుక్‌లో ఉన్న వివరాలను, సమాచారాన్ని అధికారులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్, మండలాల గణాంక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రమేష్ రాథోడ్‌కు జిల్లాతో చెరగని అనుబంధం



నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్, జూన్ 29: జిల్లాతో మాజీఎంపీ రమేష్ రాథోడ్‌కు చెరగని అనుబంధం ఉందని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్న సమయంలో రమేష్ రాథోడ్ మరణవార్త తెలియడంతో సమావేశంలో సభ్యులంతా కలిసి రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఆసిఫాబాద్‌నుంచి జడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా జడ్పీచైర్మన్‌గా పనిచేశారని అన్నారు. నార్నూర్ మండలం తాడిహత్నూర్‌లో జన్మించిన ఆయన 1999-2004మధ్య ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేశారని, అనంతరం2006లో ఆసిఫాబాద్ జడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా 2009వరకు పనిచేశారని అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

నలుగురిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ

ఆసిఫాబాద్, జూన్ 29: జిల్లాలో ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణ భూపరిహారంలో జరిగిన అక్రమాల కేసులో నలుగురిని శనివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ ఫోర్‌లైన్‌రోడ్డువిస్తరణ భూపరిహారం చెల్లింపులో జరిగిన అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో గత మేలో ఆర్డీవో సిడాం దత్తుతోపాటు ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు విచారణలో భాగంగా శనివారం వరంగల్‌లో పనిచేస్తున్న ఆర్డీవో సిడాం దత్తును, ఆర్ఐ నాగోరావ్‌ను ఆదిలాబాద్‌లో, పట్టణానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులైన లక్ష్మీ నారాయణగౌడ్‌ను హైదరాబాద్‌లో,సుబ్బ శంభుదాస్‌ను ఆసిఫాబాద్‌లో అదుపులోకి తీసుకొని కరీంనగర్ ఏసీబీ కార్యలయానికి తరలించి విచారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

మొక్కలు నాటి కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్


మొక్కను నాటుతున్న కొత్తపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 29: మొక్కలు నాటిన తర్వాత వాటిని కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం పార్టీ పిలుపు మేరకు మండలంలోని వంజిరి గ్రామ పరిధిలో మొక్కలు నాటి మాట్లాడారు. ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జూలై6వరకు డాక్టర్ శ్యామా ప్రసాద్‌ముఖర్జీ జయంతి ఉత్సవాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయిహరీశ్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకోసం మొక్కలు నాటడం తప్పనిసరిఅన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, వీరభద్రాచారి, మనోహర్ గౌడ్, గజ్జల లక్ష్మణ్, దోని శ్రీశైలం, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

సిర్పూర్(యు)/లింగాపూర్ జూన్ 29: సిర్పూర్(యు), లింగాపూర్ మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాలను ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా అదనపుకలెక్టర్ దీపక్‌తివారి కేజీబీవీ భవనాలను పరిశీలించారు. అధికారులతో పనులపై అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీపీవో భిక్షపతి గౌడ్, ఎంఈవో కుడ్మెత సుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వపన్న, మాజీసర్పంచ్ ఆర్క నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ ఏరియా కార్యవర్గం

శ్రీరాంపూర్, జూన్ 29: సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా కార్యవర్గాన్ని శనివారం నియమించారు. నస్పూర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏరియా ఉపా ధ్యక్షుడిగా నాతాడి శ్రీధర్‌రెడ్డి, ఏరియా కార్యదర్శిగా కట్ట ఈశ్వరాచారి, సంయుక్త కార్యదర్శులుగా రామగిరి పురుషోత్తమచారి, బోయిని మల్లయ్య, బొంపల్లి రమేష్, సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం స్వామి, పి సతీష్, జెల్ల తిరుపతి, ఆజ్మీరా గణేష్, మంద కమలాకర్, గంట శ్రీకాంత్, కోశాధికారిగా జి శ్రీకాంత్, కార్యాలయ కార్యదర్శిగా దొంతుల రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏబీకేఎంఎస్-బీఎంఎస్ ఆడిటర్ మంద రమాకాంత్ వ్యవహరించారు.

బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దు

శ్రీరాంపూర్, జూన్ 29: బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దని టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె సురేందర్ రెడ్డి అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి తవ్విన నాలుగు బొగ్గు బ్లాకులను కేంద్రం వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాల్సి ఉండగా, సహకరించడం సముచితంగా లేదన్నారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి బొగ్గు గనులశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ వేలం నిర్వహించడం శోచనీయమ న్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పెట్టెం లక్ష్మణ్, అన్వేష్ రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శిగా సురేందర్ రెడ్డి

● శ్రీరాంపూర్ ఏరియాకు పలు పదవులు


కె సురేందర్ రెడ్డి | పెట్టం లక్ష్మణ్

శ్రీరాంపూర్, జూన్ 29: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర కమిటీని శనివారం ఆ యూనియన్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ప్రకటించారు. టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాదాసి రామమూర్తిని ఎంపిక చేశారు. ప్రధానకార్యదర్శిగా కేతిరెడ్డి సురేందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. పూర్తిస్థాయి కార్యవర్గంలో శ్రీరాంపూర్ ఏరియాకు పలు పదవులుదక్కాయి. ఉపప్రధాన కార్యదర్శిగా బండి రమేష్, సంయుక్తకార్యదర్శిగా పానుగంటి సత్తయ్య, చీఫ్‌ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెండ్రి అన్వేష్‌రెడ్డి, కేంద్ర కార్యవర్గసభ్యులుగా ముస్కాల రమేష్, లాల, గోపియా, గోనెస్వామి ఎన్నికయ్యారు. 11ఏరియాలకు చెందిన ఉపాధ్యక్షులను నియమించగా, ఎస్ఆర్పీ1గనిలో అసిస్టెంట్ సూపరింటెం డెంట్‌గా పనిచేస్తున్న పెట్టం లక్ష్మణ్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

ఉపాధ్యక్షులు వీరే..

సింగరేణిలోని 11డివిజన్లకు శనివారం సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి టీబీజీకేఎస్ వైస్‌ప్రెసిడెంట్లను ప్రకటించారు. బెల్లంపల్లి ఉపాధ్యక్షుడిగా మల్రాజు శ్రీనివాసరావు, మందమర్రి ఉపాధ్యక్షుడిగా మేడిపల్లి సంపత్, శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్, ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడిగా వడ్డేపల్లి శంకర్, ఆర్‌జీ-2 ఉపాధ్యక్షులుగా ఐలి శ్రీనివాస్, ఆర్‌జీ-3 ఉపాధ్యక్షులుగా నాగెల్లి సాంబయ్య ఎంపిక చేసినట్టు రాజిరెడ్డి తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి: జీఎం


గదిని ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జూన్ 29: ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఏరియా జీఎం బి సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలో సందర్శకుల కోసం రూ.5లక్షల ఖర్చుతో నిర్మించిన గదిని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులు ఈ గదిలో వేచి ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శణీయులు పురుషోత్తమరెడ్డి..

సింగరేణిలో 42సంవత్సరాల 5నెలల సుదీర్ఘ సర్వీసుచేసిన ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి అదర్శణీయులని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. పురుషోత్తమరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా జీఎం కార్యాలయంలో ఆయనను సన్మానించారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సీఎంఎవోఏఐ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి,ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, తదితరులు పాల్గొన్నారు. ఆర్కే6గనిలో పనిచేస్తూ రిటైర్‌అయిన పుల్లూరి మధునయ్య, మాసు దేవయ్యను గనిమేనేజర్ ఈ తిరుపతి సన్మానించారు. వారికి రావాల్సిన టర్మినల్ బెనిఫిట్స్‌ను అందించారు.

సింగరేణి సంస్థను కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 29: సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సింగరేణి కార్మికసంఘాల ఐక్యవేదిక(జేఏసీ) నాయకులు పేర్కొన్నారు. ఆర్కే7 గనితో పాటు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సింగరేణికి చెందిన బొగ్గు గనులను వేలం వేయాలనుకోవడం దారుణమన్నారు. దీనివల్ల సంస్థకు భవిష్యత్ ఉండదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించవని పేర్కొన్నారు. బొగ్గు బ్లాకులను వేలంవేయవద్దని పలుగనులపై ఆందోళనలు చేపట్టామని, వచ్చే నెల3న మేధావులతో హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ(ఎస్‌వి), టీఎన్‌టీయూసీ, టీఎస్‌యుఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, తిప్పారపు సారయ్య, వి అనిల్‌రెడ్డి, ఐ కృష్ణ, చాంద్‌పాషా, నీరటిరాజన్న, మేకల రాములు, మణిరామ్‌సింగ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ జీఎంకు సన్మానం

జైపూర్, జూన్ 29: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ జీఎం బసివిరెడ్డి శనివారం పదవీ విరమణ పొందగా ఎస్టీపీపీ అధికారులు ఘనంగా సన్మానించారు. జీఎంగా పవర్‌ప్లాంట్‌కు ఆయన చేసినసేవలను కొనియాడారు. అనంతరం జీఎం బసివిరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో సుదీర్ఘంగా 38 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ చేయడం చాలా గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు. తోటిఉద్యోగుల సహాయ సహ కారాలతో సర్వీసు పూర్తిచేశానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు ఎలీషా, జేఎన్‌సింగ్, ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, రమణ, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీసత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడు

శ్రీరాంపూర్, జూన్ 29: ఆర్కే7 గనిలో అధికారులు బొగ్గు హ్యాండ్ ఫిల్లింగ్(చేతుల ద్వారా) చేయించడంతో ఓ కార్మికుడి వేలికి గాయమైంది. గనిలోపనిచేసేకార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సెకండ్‌షిఫ్ట్‌లో 2ఏసౌత్30లెవల్, 17 డిప్‌లో 22మంది కార్మికులతో (చేతుల ద్వారా) బొగ్గు ఎత్తిస్తుండగా, పి అశోక్ అనే జనరల్‌మజ్దూర్ కార్మికుడి వేలు టబ్బుకు, బొగ్గుపెల్లకు నడుమ ఇరుక్కుపోయింది. దీంతో మధ్య వేలుకు తీవ్రగాయమైంది. అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అశోక్‌ను ఏఐటీయూసీ నాయకులు ఉపప్రధానకార్యదర్శి అక్బర్‌అలీ, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, ఆర్కే7 పిట్ కార్యదర్శి బీర రవీందర్ తదితరులు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్మికుడి చేతివేలు ఫ్యాక్చర్ అయ్యిందని, అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనకు అధికారులే బాధ్యతవహించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ ఘటనపై విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.